# మాయ ముసుగు



మంచంపై మేనువాల్చి తదేకంగా నిశీధిలోకి చూస్తున్నాడు శంకరయ్య. అతనిలో చీకు చింత, ఆదుర్దా ఏకోశానా కానరావడం లేదు.

అసలు వాటి అవసరం—పెళ్ళీడుకెదిగిన కూతుర్లు, ఉద్యోగం లేని కొడుకులు గుండెలమీద కుంపటిలా వున్న వాళ్ళకేగా...

అవన్నీ ఎంచక్కా నెరవేరి ఇటీవలే షష్టిపూర్తి చేసుకున్న శంకరయ్యకు ఇంక బెంగ ఏముంటుంది?

అతనికీ భార్య పార్వతమ్మకూ మధ్య ఐదేళ్ళ వ్యత్యాసం.

సతతం సచ్ఛీలతతో, భర్త అడుగు జాడల్లోనే నడుస్తూ ఎవరి చేత వేలెత్తి చూపించుకోని పార్వతమ్మ—

ఆ వేళలో భర్త కోసం వేడి వేడిగా చిక్కటి ఫిల్టర్ వేసిన కాఫీ పొగలు గక్కుతుండగా ట్రేలో తెచ్చింది.

ఒకరికొకరు తోడు!

ఇద్దరు కూతుర్లు. ముగ్గురు కొడుకులు. వాళ్ళ ఉద్యోగాలు చదువులు, పెళ్ళిళ్ళు...అన్నీ ఓ.కే. ప్రస్తుతం వాళ్ళంతా వేర్వేరు కాపురాలు చేసుకుంటున్నారు వేర్వేరుచోట్ల.

శంకరయ్య ఆదే ఉద్యోగంలో రిటైరై వచ్చే పెన్షన్, నెలకింతని వంతుల వారీగా కొడుకులిచ్చే దాంతో భార్యతో కలిసి హాయిగానే రోజులు వెళ్ళదీస్తున్నాడు.

"ఏమండీ! మన చిన్నబ్బాయి కొడుక్కి ఫ్లూ జ్వరమట. వాళ్ళ పనిమనిషి చెప్పింది. విన్నప్పట్నించీ నా మనసు మనసులో లేదు. వెళ్ళి చూసిరానా?' భర్త కాఫీ తీసుకుంటుండగా మెల్లగా మాట జారవిడిచింది పార్వతమ్మ.

శంకరయ్య తలంతా ఫలిత కేశాలు. ముఖాన ముడుతలు. కళ్ళల్లో కాంతి మాత్రం ఇంకా చెక్కు చెదరలేదు. పెదవులు విడివడకుండానే నవ్వుతూ భార్యకేసే చూసి తలతిప్పాడు.

'చిన్నబ్బాయికి కన్న తల్లివి. వాడి వంశాంకురానికి నాన్నమ్మవు. పాశం కొట్టుకులాడ్డంలో విడ్డూరం లేదు. కానీ...కోడలుపిల్ల నిన్ను చూస్తేనే పెడమొగం పెడుతుందేమో!? దాంతో బాధపడిపోతూ 'మళ్ళీ నాకేగా వచ్చి చెప్తుకుంటావు...'

ఆమె ఏం చెప్తుందోనని క్షణం ఆగాడు.

ఆమె మాత్రం చెవులప్పగించే వుంది.

భర్త ఏదైనా చెప్తుంటే మధ్యలో కలగచేసుకోకపోవడం మొదట్నుంచీ ఆమెకున్న సుగుణం. వయస్సు పైబడి అలవాటులో మార్పేమైనా వచ్చిందేమోనని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూనే వుంటాడతను.

కానీ ప్రతిసారీ ఓటమి అతనిదే!

అలాగే ఇప్పుడూ భార్య నోరు మెదిపే సూచనలు కనపడకపోయేసరికి తన ఉద్దేశ్యాన్ని కొనసాగించాడు.

'కాబట్టి మన బిడ్డలు...వారి బిడ్డలపై వ్యామోహం ఈ వయస్సులో సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం మన ఆరోగ్యానికే మంచిది! అదే వాళ్ళొచ్చి చెబితే ఇద్దరం ప్రాకులాడ్దాం! అలా కాకుండా పనిమనిషి చెప్పింది. దార్నెళ్ళే ఇంకెవరో చెప్తారని టెన్షన్ కొని తెచ్చుకోవడం రక్తపోటుకు దారితీసినట్లే! మంచాన పడితే ఒకరి బాధ మరొకళ్ళం చూళ్ళేక కన్నీరు పెట్టుకోవడమే! నాకు తోచింది చెప్పాను. ఆపైన నీ ఇష్టం...'

ట్రేని వెనక్కి తీసుకెళ్తూ నిష్ఠూరపడింది పార్వతమ్మ 'మీకేం మగవారు, గుండె దిటవున్నవారు! కడుపు చించుకు బిడ్డల్ని కన్న తల్లిని. వాళ్ళకు, వాళ్ళ రక్త సంబంధీకులకు బావోలేదంటే వెళ్ళి చూసిరాకుండా ఎలా వుండగల్ను? నన్ను వెళ్ళమనీ చెప్పరు. వెళ్ళద్దనీ అనరు. ఎంత వయస్సొచ్చినా ఆడదాన్నేగా! శ్లేషార్థాలతో నిర్ణయం నాకే వదిలేసే మీ అసలు అంతర్యమేమిటో ఎన్నేళ్ళు కలిసి కాపరం చేసినా తెలిసిచస్తేనా...'

ఆమె మాటలు విని 'నా అంతర్యం బోధపర్చుకోలేనంత పల్లెటూరి బైతువా నువ్వు! ఓల్డ్ బి.ఎ. దాకా చదివి లోకం తీరు తెన్నులు సాకల్యంగా అవపోసన పట్టి ఇంకా మాయ ముసుగే...ఆ మాయముసుగు వల్లనేగా ఈ చరాచర జగత్తూ పాశంబడిలోపడి అంతతేలిగ్గా పైకి లేవలేక కొట్టుమిట్టాడుతున్నదీ...స్వగతంగా నిట్టూర్చాడు భర్త.

— వి.ఎం.ఎస్. స్వాతి

## భవితవ్యం

తన భవిష్యత్ చెప్పమంటూ ముప్పై సంవత్సరాల అందాల చిన్నది ఒక జ్యోతిష్కుని దగ్గరకు వచ్చింది.

జ్యోతిష్కుడు ఆమె చేయి, జాతకం పరిశీలించి అయ్యో త్వరలో మీవారు తీవ్రంగా హత్య గావించబడే ప్రమాదముంది అని చెప్పాడు.

అది విన్న సుందరి తాపీగా! అదే సరే! నేను నిర్దోషిగా బయటపడే అవకాశముందంటారా? చూడండి...అంది.

— పద్మశ్రీ.

